డ్వాక్రా యానిమేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి - గణపవరం

డ్వాక్రా యానిమేటర్ల ఉద్యోగ భద్రత హరించే కాలపరిమితి సర్క్యులర్‌ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం డ్వాక్రా యానిమేటర్లు స్థానిక వెలుగు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యానిమేటర్ల సంఘ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమారి మాట్లాడుతూ ప్రభుత్వం రోజురోజుకూ పని భారం పెంచుకుంటూ పోతుందన్నారు. వారి శ్రమకు తగ్గ వేతనాలు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం యానిమేటర్ల వ్యతిరేక విధానాలు మానుకోకపోతే రాబోయే కాలంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామన్నారు. అనంతరం వెలుగు కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పి.గోవిందు, యానిమేటర్ల మండల కమిటీ అధ్యక్షురాలు తోట పద్మావతి, యానిమేటర్లు పాల్గొన్నారు.

అకాల వర్షం.. అనూహ్య నష్టం..!

రెండు రోజులుగా జిల్లావ్యాప్తంగా వర్షాలు
వరి, మామిడి, మిరప, మొక్కజొన్న, పొగాకు పంటలకు నష్టం
దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే పరిస్థితి
కళ్లాల్లోని మిర్చిని కాపాడుకునేందుకు రైతుల అవస్థలు
లబోదిబోమంటున్న అన్నదాత

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అకాల వర్షం అన్నదాతను వణికిస్తోంది. పంటలపై తీవ్ర ప్రభావం చూపనుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. ముఖ్యంగా చివరి దశకు చేరుకున్న వరి, మామిడి, మిర్చి, మొక్కజొన్న, పొగాకు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులకు ఏం చేయాలో అర్థంకాని దుస్థితి నెలకొంది. రెండు జిల్లాల్లోనూ దాదాపు 3.60 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. పంటంతా పొట్ట, ఈనిక దశలో ఉంది. ప్రస్తుతం ఈనిక దశలో వర్షాలు కురుస్తుండటంతో కంకుల మీద ఉన్న సొంపు రాలిపోయి పొల్లు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. రబీలో ఈనిక దశలో వర్షాలు కురిస్తే మెడ తెగులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని రైతులు బెంబేలెత్తిపోతున్నారు. దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే పరిస్థితి ఉండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈదురుగాలులకు వరి పొలాలు నేలనంటే ప్రమాదం ఉండటంతో అన్నదాత గుబులు చెందుతున్నాడు. మరో మూడు రోజులు వర్షాలు కురవనున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు గుబులు చెందుతున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.30 వేల వరకూ పెట్టుబడులు పెట్టారు. పంటంతా చివరి దశకు చేరింది. సాగునీటి కోసం అధిక పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. వర్షాలతో పంట దిగుబడి తగ్గితే పెట్టుబడులు రావడం కూడా కష్టంగా మారే పరిస్థితి ఉందని రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.

వేలేరుపాడులో మిర్చిపై కప్పిన టార్పాలిన్లు

అన్ని పంటలకూ నష్టమే

జిల్లాల విభజన తర్వాత ఏలూరు జిల్లాలో దాదాపు 50 వేల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. పంటంతా పూత, పిందె దశలో ఉంది. అకాల వర్షాలు మామిడి పంటను తీవ్రంగా దెబ్బతీసే పరిస్థితి నెలకొంది. తామర తెగులు, మచ్చతెగులు విజృంభించే అవకాశం ఉందని ఉద్యానవన శాఖాధికారులు రైతులను హెచ్చరిస్తున్నారు. అందుకు సంబంధించిన సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. అంతేకాకుండా చలిగాలులు, వర్షాలకు మామిడిపూత రాలిపోయే పరిస్థితి నెలకొంది. దీంతో మామిడి దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ఇప్పటికే పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టిన మామిడి రైతులు అకాలవర్షాలతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో లక్ష ఎకరాల్లో మొక్కజొన్న సాగైంది. పంటంతా కోత దశకు చేరింది. వర్షాలకు, గాలులకు మొక్కజొన్న మొక్కలు పడిపోవడం, కంకులకు బూజు తెగులు వంటి సమస్యలు తలెత్తనున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా దిగులు చెందుతున్నారు. విలీన మండలాలు కుక్కునూరు, వేలేరుపాడుతోపాటు జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో దాదాపు 30 వేల ఎకరాల్లో రైతులు మిర్చి సాగు చేశారు. పంటంతా కోత దశకు చేరడంతో రైతులు పంట కోసి ఒబ్బిడి చేస్తున్నారు. కళ్లాల్లో ఉన్న పంటంతా అకాల వర్షాలకు తడిసి ముద్దవుతోంది. కురుస్తున్న వర్షాలకు ఏజెన్సీ ప్రాంతంలోని వేలేరుపాడు, రేపాకగొమ్మి, రుద్రమ్మకోట, తిరుమలాపురం, చిగురుమామిడి, నార్లవరం, వసంతవాడ వంటి గ్రామాల్లో రైతులు పండించిన మిర్చిని కాపాడుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టార్పిన్లతో కప్పి పంటను కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టిన రైతులు లబోదిబోమంటున్నారు. పంట తడిస్తే ధరపై తీవ్ర ప్రభావం చూపనుండటంతో రైతులు గుబులు చెందుతున్నారు. ఏలూరు జిల్లాలో దాదాపు 25 వేల ఎకరాల్లో పొగాకు సాగవుతోంది. పొగాకు ప్రస్తుతం చాలాచోట్ల కోసి పన దశలో ఉంది. వర్షాలకు తడిచి ఆకులోని రసం అంతా కిందకు దిగిపోనుంది. దీంతో పంట నాణ్యత దెబ్బతిని ధరపై తీవ్ర ప్రభావం చూపనుంది. అకాల వర్షం అన్ని పంటల రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తోంది. అకాల వర్షాలతో సోకే తెగుళ్లపై వ్యవసాయాధికారులు అవగాహన కల్పించి పంటను కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఈనిక దశలో ఉన్న వరిపొలం

జిల్లాలో విస్తారంగా వర్షాలు

నూజివీడు రూరల్ : అల్పపీడన ద్రోణి కారణంగా రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు నూజివీడు మండల రైతులు ఆందోళన చెందుతున్నారు. పొగాకు, మొక్కజొన్న, మామిడి పంటలకు నష్టం వాటిల్లింది. మండలంలో పోతిరెడ్డిపల్లి, గొల్లపల్లి, తుక్కులూరు తదితర గ్రామాల్లో సుమారు వంద ఎకరాల్లో పొగాకు పంట సాగు చేశారు. వర్షాలు కారణంగా పందిళ్లపై ఉన్న పొగాకు పూర్తిగా తడిసింది. రైతులు పాలిథిన్ పరదాలు అద్దెకు తీసుకొచ్చి కప్పినప్పటికీ ప్రయోజనం లేదని రైతులు వాపోతున్నారు. మండలంలో 17 వందల ఎకరాల్లో సీడు మొక్కజొన్న సాగు చేయగా, ఇప్పటికే వెయ్యి ఎకరాల్లో ఒబ్బిడి పూర్తయింది. సుమారు 700 ఎకరాల్లో పంట చేలల్లో ఉంది. ఈ వర్షాలకు మొక్కజొన్న పూర్తిగా తడిసిపోయిందని రైతులు చెబుతున్నారు. అలాగే వేలాది ఎకరాల్లో మామిడి సాగు చేస్తున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పూత, పిందె దశలో ఉన్న పంట వర్షాల కారణంగా రాలిపోతోంది. పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘాల నాయకులు నిమ్మగడ్డ నరసింహ కోరారు.

బుట్టాయగూడెం: ఆకాశం మేఘావృతమై మండలంలో శనివారం పలుచోట్ల వడగండ్ల వర్షం కురిసింది. ఈ వర్షం జీడి మామిడికి నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పూత, పిందె రాలిపోయి పంట దిగుబడి తగ్గుతుందని కంగారుపడుతున్నారు. అలాగే మొక్కజొన్న పంట కూడా చేతికొస్తుందని, ఈ సమయంలో వర్షం వల్ల నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. బుట్టాయగూడెంలో శనివారం సంతకు వచ్చిన కొనుగోలుదారులు, వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు.

జీలుగుమిల్లి : అల్పపీడన ద్రోణి ప్రభావంతో మండలంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పలుచోట్ల పంటలు దెబ్బతిన్నాయి. చేతికి వచ్చిన మిరప, మొక్కజొన్న, పొగాకు, జీడిమామిడి, మామిడి పంటలకు నష్టం వాటిల్లింది. మండలంలోని రౌతుగూడెం వద్ద జాతీయ రహదారిపై భారీ వృక్షం నేలకొరడగంతో బుట్టాయగూడెం, జీలుగుమిల్లికి రాకపోకలు నిలిచిపోయాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

టి.నరసాపురం : మండలంలో పలుచోట్ల వడగండ్ల వాన కురిసింది. బొర్రంపాలెం, ఏపిగుంట, టి.నరసాపురం తదితర ప్రాంతాల్లో ఈదురు గాలులతో వర్షం కురిసింది. మామిడి, మొక్కజొన్న, పొగాకు, నిమ్మ పంటలకు నష్టం వాటిల్లిందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. తిరుమలదేవిపేటలో మూడు పెంకుటిళ్లపై చెట్టు కూలడంతో పాక్షికంగా దెబ్బతిన్నాయి.

ముదినేపల్లి : రైతన్నను వర్షం వెంటాడుతోంది. మూడోరోజు శనివారం కూడా వర్షం పడడంతో మినుము రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. పనలపై ఉన్న పంట తడిసిపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చిన్నం మాధవ కోరారు.

చాట్రాయి : అకాల వర్షానికి కల్లాల్లో ఆరబెట్టిన మొక్క జొన్న పంటలు పూర్తిగా తడిసిపోయాయి. తడిసిన మొక్కజొన్న కొనుగోలు చేసే పరిస్థితి లేదనిరైతులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతున్నారు.

ఉంగుటూరు : మండలంలో పలు గ్రామాల్లో మోస్తురు వర్షం కురిసింది. ఉదయం నుంచి వాతావరణం చల్లబడి మబ్బులతో ఉంది. మధ్యాహ్నం నుంచి కురిసిన వర్షానికి మెరక ప్రాంత పొలాలకు మేలు జరిగినా ధాన్యం గింజ గట్టిపడే దశలో వర్షం పడటంతో రైతులకు నష్టమేనని పలువురు రైతులు వాపోతున్నారు. పలు చోట్ల డ్రెయిన్లు పొంగిపొర్లాయి.

నేలకొరిగిన మొక్కజొన్న

అకాల వర్షానికి మొక్కజొన్న పంట నేలకొరిగింది. కల్లాల్లో ఆరబెట్టిన మొక్కజొన్న కండెలు తడిసిపోయాయి. పందిరి మీద ఉన్న పొగాకు పంటకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 70 ఎకరాల్లో పొగాకు, 1560 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు సాగవుతున్నాయి. ఈ వర్షానికి కొత్తగూడెం, అక్కుపల్లిగోకవరం గ్రామాల్లో కండెల మీదున్న మొక్కజొన్న పంట నేలకొరిగింది.

నాలుగు ఎకరాల్లో నేలకొరిగిన మొక్కజొన్న
మక్కే సూర్యచంద్రరావు

నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న వేశాను. పంట చేతికి వచ్చే దశలో వర్షానికి సగంపైగా నేలకొరిగింది. అన్ని బావుంటే ఎకరానికి 45 నుంచి 50 బస్తాలు దిగుబడి రావాల్సి ఉంది. చేను పడిపోడంతో ఎంత నష్టం వస్తుందో తెలియడం లేదు.

చెట్టు కూలి మహిళ మృతి

జంగారెడ్డిగూడెం : మండలంలోని తాడువాయిలో ఈదురు గాలులకు చెట్టు కూలి రేకులషెడ్డుపై పడిన సంఘటనలో మహిళ మృతి చెందింది. తాడువాయిలో ముత్యాలమ్మ ఆలయ సమీపంలో ఉన్న భారీ రావిచెట్టు కూలి రేకుల షెడ్డుపై పడింది. ఈ ప్రమాదంలో షెడ్డులో ఉన్న సంధ్య(37) అక్కడికక్కడే మృతి చెందింది. ఈమెకు భర్త శ్రీను, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకూడదు

స్థాయీసంఘ కమిటీ సమావేశంలో జెడ్‌పి చైర్మన్ శ్రీనివాస్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్టమైన కార్యాచరణ అమలు చేయాలని సంబంధిత అధికారులను జెడ్‌పి చైర్మన్ కవురు శ్రీనివాస్ కోరారు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో శనివారం జెడ్‌పి స్థాయీసంఘ సమావేశం జరిగింది. ప్రణాళిక, ఆర్థికస్థాయి కమిటీ, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్యా, వైద్యసేవలు, మహిళా సంక్షేమం, సాంఘీక సంక్షేమం పనులస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాల్లో జెడ్‌పి వైస్ చైర్మన్ పోసిన శ్రీలేఖ, పెనుమాల విజయబాబు, ఆయా కమిటీ సమావేశాలకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వేసవిలో నీటిఎద్దడి లేకుండా అవసరమైన పటిష్టమైన చర్యలు తీసుకోవాలని పలువురు జెడ్‌పిటిసి సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భగా కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ వేసవిలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉందన్నారు. ఏలూరు జిల్లాలో రూ.63.14 లక్షలతో సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెప్పారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో అధికారుల పనితీరు అభినందనీయమని పలువురు జెడ్‌పిటిసి సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో 200 రైతు భరోసా కేంద్రాల ద్వారా 3,05,205 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 39,387 మంది రైతుల నుండి కొనుగోలు చేశామన్నారు. రబీలో 277 రైతు భరోసా కేంద్రాల్లో 1858 మెట్రిక్ టన్నులు ఎరువులు నిల్వ చేశామన్నారు. మార్క్ ఫెడ్ ద్వారా 1250 మెట్రిక్ టన్నులు ఎరువులు అందుబాటులో ఉంచామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ 2,36,148 ఎకరాల్లో (98.3శాతం) ఇ-క్రాప్ నమెదు జరిగిందన్నారు. రైతు భరోసా-పిఎం కిసాన్ కింద 2022-23 సంవత్సరంలో మూడు విడతలుగా 1,95,707 మంది రైతులకు రూ.264.20 కోట్లు రైతుల ఖాతాలకు జమచేశారన్నారు. 1.35 కోట్ల ఉపాధి పనిదినాలు కల్పించామని తెలిపారు. సమావేశంలో జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్, జెడ్‌పిటిసి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌కు జెడ్‌పిటిసిల అభినందన

స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికైన జెడ్‌పి చైర్మన్ కవురు శ్రీనివాస్‌ను పలువురు జెడ్‌పిటిసిలు, అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి వైస్‌చైర్మన్లు పోసిన శ్రీలేఖ, పెనుమాల విజయ బాబు, జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్ పాల్గొన్నారు.

క్లాప్ డ్రైవర్లకు సెలవులు అమలు చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు

నగర పాలకసంస్థ క్లాప్ ఆటో డ్రైవర్లకు డిఎంఎ ఉత్తర్వుల ప్రకారం ఆదివారం వారాంతపు సెలవులు అమలు చేయాలని, 15 రోజుల క్యాజువల్ లీవులు ఇవ్వాలని, తొమ్మిది జాతీయ, పండుగ సెలవులు అమలు చేయాలని కోరుతూ క్లాప్ డ్రైవర్ల కమిటీ నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణకు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతీకి వినతులు అందించారు. ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) క్లాప్ ఆటో డ్రైవర్ల కమిటీ ఆధ్వర్యంలో ఈ వినతిపత్రాలు అందించారు. ఏడాదిన్నర కాలంగా క్లాప్ డ్రైవర్లు ఒక్కరోజు కూడా సెలవు లేకుండా 365 రోజులు పనులు చేయాల్సి వస్తుందని, అనారోగ్యం పాలై సెలవు పెట్టిన, అత్యవసర పని ఉండి సెలవు పెట్టినా జీతాల్లో కోత విధిస్తున్నారని, ఇచ్చే అరకొర జీతాల్లో కోతల వల్ల కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని వినతిలో పేర్కొన్నారు. డిఎంఎ ఉత్తర్వుల ప్రకారం సెలవులు ఇవ్వాలని కోరారు. వినతులు అందించినవారిలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు బి.సోమయ్య, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్‌బాబు, క్లాప్ ఆటో డ్రైవర్ల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.సుగుణరావు, పుష్పరాజ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

20న మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 20వ తేదీన విజయవాడలో జరిగే ధర్నాలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు శుక్ల బోయిన రాంబాబు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులను ప్రభుత్వం గుర్తించి కనీస వేతనాలివ్వాలని డిమాండ్ చేశారు. ప్రతీ నెల ఐదో తేదీలోపు వేతనాలు చెల్లించాలని, 12 నెలలకు వేతనాలు ఇవ్వాలని, ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు రూ.20కు పెంచాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. వంట సమయంలో అగ్ని ప్రమాదానికి గురైన వారికి నష్టపరిహారం చెల్లించాలని, ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని, సామాజిక భద్రత సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో నిధులు పెంచాలని, ఈ పథకాన్ని ప్రయివేటు సంస్థలకు అప్పగించరాదన్నారు. సంవత్సరానికి రెండు జతలు యూనిఫారమ్ ఇవ్వాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. 20 ఏళ్లుగా మధ్యాహ్నం భోజన కార్మికులతో ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయిస్తోందన్నారు. వర్కర్లపై పనిభారాన్ని తగ్గించాలని కోరారు. కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం యూనియన్ నాయకులు ఎమ్‌డి.ఆశ మాట్లాడుతూ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, హైస్కూళ్లలో పనిచేస్తున్న వారికి వేతనాలు పెంచాలని, రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు ఎ.అంజలీదేవి, కె.ధనలక్ష్మి, కె.రమాదేవి, గాలి దేవర, మంగతాయారు, మేడిన సత్యవతి, కె.కుమారి, ఎస్.సత్యవతి, తోట అన్నవరం, రామలక్ష్మి, నక్కా కృష్ణవేణి, దార లక్ష్మి, ఎ.కృష్ణవేణి పాల్గొన్నారు.

ఆయుధ కర్మాగార నిర్మాణం ఆపాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఏజెన్సీ ప్రాంతంలో ఆయుధ కర్మాగార నిర్మాణాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని ఎపి గిరిజనసంఘం మండల కార్యదర్శి పోలోజు నాగేశ్వరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఆదివాసీ విజ్ఞాన కేంద్రంలో గిరిజన సంఘం మండల కమిటీ సమావేశానికి మండల అధ్యక్షులు కారం భాస్కర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో ఏజెన్సీలో ఆయుధ కర్మాగారం నిర్మాణానికి భూములు సేకరించే ప్రక్రియను నిలుపుదల చేయాలని హెచ్చరించారు. జీలుగుమిల్లి మండలంలోని రామన్నగూడెం, వంకవారిగూడెం, తాటియాకులగూడెం గ్రామాల్లో సుమారు 2500 ఎకరాల భూమిని ఆయుధాల తయారీ, డంపింగ్ యార్డ్ కోసం సేకరించేందుకు సర్వే చేయడం దారుణమన్నారు. ఇప్పటికే మండలంలో పోలవరం నిర్వాసితులకు పునరావాసం, పరిహారం కోసం భూములను కేటాయించారన్నారు. ఒక పక్క బంగారుపాపమ్మ, జల్లేరు రిజర్వాయర్, చింతలపూడి ఎత్తిపోతల పథకం కోసం, మరోపక్క ఆయుధాల కర్మాగార నిర్మాణం కోసం భూములను సేకరిస్తే ఏజెన్సీలో భూములు గిరిజనులకు మిగులుతాయా అని ప్రశ్నించారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ గిరిజన సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ఐటిడిఎలో అధికారులు లేక సంక్షేమం నిర్వీర్యమైపోతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఐటిడిఎలో ఖాళీ పోస్టులను భర్తీచేసి గిరిజనులకు న్యాయం చేయాలన్నారు. ఈ నెల 26, 27 తేదీల్లో జీలుగుమిల్లిలో జరిగే జిల్లా మహాసభను జయప్రదం చేయాలన్నారు. 27న వేలాది మంది గిరిజనులతో భారీ ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందన్నారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా ఆదివాసీ అధికార రాష్ట్రీయ మంచ్ జాతీయ చైర్మన్, భద్రాచలం మాజీ పార్లమెంట్ సభ్యులు మిడియం బాబూరావు, సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు లోతా రాంబాబు, కిల్లో సురేంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, తామ ముత్యాలమ్మ పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు చంద్రు బుల్లెమ్మ, చోడెం దుర్గ, కొవ్వాసి దుర్గారావు, కట్టం వెంకటేశ్వరావు, పూనెం మల్లేశ్వరావు, సిహెచ్.శ్రీను, తెల్లం మునీశ్వరరావు పాల్గొన్నారు.

వక్ఫ్ భూముల పరిరక్షణకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ముస్లిము వక్ఫ్ బోర్డు భూములను పరిరక్షించాల్సిన బాధ్యత మైనారిటీ సంక్షేమ శాఖపై ఉందని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వక్ఫ్ బోర్డు భూముల పరిరక్షణ, ముస్లీము సంక్షేమంపై సమీక్షా సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో వక్ఫ్ బోర్డు భూమి 375.63 ఎకరాలు ఉందన్నారు. ఈ భూములు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాల్సిన బాధ్యత మైనారిటీ సంక్షేమ శాఖపై ఉందని తెలిపారు. గుర్తించిన వక్ఫ్ బోర్డు భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసి బోర్డును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాలో ముస్లిం వక్ఫ్ బోర్డు భూముల పరిరక్షణ, ముస్లిం సంక్షేమ ప్రయోజనాలకు పటిష్ట ప్రణాళికను రూపొందించి ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి అమలు చేసే విధంగా కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ ఎవిఎన్‌ఎస్.మూర్తి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఎన్ఎస్.కృపావరం, జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ ఎమ్‌డి.షఫీర్ ఉల్లా, జిల్లా రిజిస్ట్రార్ ఎ.వెంకటేశ్వరరావు, డిపిఒ మల్లిఖార్జునరావు, ఏలూరు ఆర్‌డిఒ కె.పెంచల కిషోర్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనరు ఎం.వెంకటకృష్ణ, ఆర్అండ్‌బి అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సిఎం జగన్‌ను కలిసిన ఎంఎల్‌సిలు

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలుపొందిన కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ సిఎం జగన్‌ను శనివారం ఆయన ఛాంబర్‌లో కలిశారు. వీరిని ముఖ్యమంత్రి అభినందించారు. రాబోయే ఎన్నికల్లో జిల్లాలోని మొత్తం 15 స్థానాలు వైసిపి గెలిచేలా కార్యకర్తలను సన్నద్ధం చేయాలని సిఎం వీరికి సూచించారు. వీరివెంట ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, తానేటి వనిత, మాజీ మంత్రి చెరుకూరి శ్రీరంగనాధరాజు ఉన్నారు.



ఎంఎల్‌సిగా ఎన్నికైనట్లు ధ్రువీకరణ పత్రాలతో సిఎం జగన్ వద్ద కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్

పోలీసులకు అప్పగించడం నేరమే

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పాఠశాలలో సీలింగ్ ఫ్యాన్లు ధ్వంసం చేశారని తొమ్మిదో తరగతి విద్యార్థులను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించడం నేరమేనని రాష్ట్ర బాలల హక్కుల రక్షణ కమిషన్ సభ్యులు డాక్టర్ జంగం రాజేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక జెడ్‌పిహెచ్ బాలుర పాఠశాలలో విద్యార్థులను దండించి పోలీస్ స్టేషన్‌లో అప్పగించిన ఘటన ఆయన విచారణ చేపట్టారు. పాఠశాలను సందర్శించిన ఆయన తొలుత విద్యార్థుల మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, పేరెంట్స్ కమిటీ సభ్యులతో సమీక్షించారు. అనంతరం రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఈ ఘటనను బాలల హక్కుల రక్షణ కమిషన్ సుమోటో కేసుగా స్వీకరించినట్లు తెలిపారు. విద్యార్థుల వైపునుంచి పొరపాట్లు ఉన్నప్పటికీ విచక్షణారహితంగా పోలీస్ స్టేషన్‌లో అప్పగించడం చట్టవిరుద్ధమన్నారు. సున్నితమైన సందర్భాల్లో విద్యార్థులను దండించడం కూడా సరికాదని తెలిపారు. ఈ సంఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. సాయంత్రం ఐదు గంటల వరకూ వేచి ఉన్నప్పటికీ మరో ఇద్దరు విద్యార్థులను స్వయంగా విచారించేందుకు వారు హాజరు కాలేదని తెలిపారు. అందువల్ల పూర్తిస్థాయిలో విచారణ చేపట్టడానికి జిల్లా, మండల స్థాయి అధికారులతో కమిషన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆయనతోపాటు సిఐ బాలసురేష్‌బాబు, ఎస్ఐ సాగర్‌బాబు, ఎంఇఒ బి.రాముడు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.జగ్గారావు, స్థానిక ఐసిడిఎస్ సిడిపిఒ బ్యూలా, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ మృత్యుంజయరావు, మహిళా కానిస్టేబుల్ మౌనిక పాల్గొన్నారు.

అంచనాలు ఆవిరి..!

రాష్ట్ర బడ్జెట్.. మన జిల్లాకు.. మన ప్రాంతానికి.. మాకు ఉపయోగకరమైన అంశాలు ఉండాలని జిల్లావాసులు కోరుకోవడం సహజం. గతంలో ప్రస్తుత పాలకులు ఇచ్చిన హామీలకు సంబంధించి ఈ బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయా, ఉంటే ఎలా ఉండొచ్చు వంటి అంచనాలతో అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టక ముందే జిల్లావాసులు రకరకాలుగా చర్చించుకున్నారు. ఎన్నికల సంవత్సరం ముందు వైసిపి ప్రభుత్వం అసెంబ్లీలో బడ్జెట్ పెట్టకనే పెట్టింది. 'కొత్త సీసాలో పాత నీరు' చందంగా పథకాల గురించి స్తోత్రర్ష తప్ప జిల్లాకు గతంలో ఇచ్చిన హామీల గురించి ప్రస్తావన లేకపోవడం జిల్లావాసులను తీవ్ర అసంతృప్తికి గురిచేసింది. ప్రతియేటా బడ్జెట్ ముందు గత హామీలను గుర్తు చేసుకుని కేటాయింపులపై అంచనాలు వేసుకోవడం మినహా బడ్జెట్‌లో మాత్రం మొండిచెయ్యి చూపుతున్నారనే విమర్శలు వెల్లువెత్తాయి. ప్రధానంగా ఏలూరు జిల్లా పరిధిలోని పోలవరం నిర్వాసితులకు సంబంధించి రాష్ట్ర బడ్జెట్‌లోనూ స్పష్టత లేకుండాపోయింది. చట్టప్రకారం పరిహారం, పునరావాస ప్యాకేజీ అన్నీ ఇచ్చిన తర్వాతే నిర్వాసితులను గ్రామాల నుంచి కదపాల్సి ఉన్నప్పటికీ ప్రాజెక్టు పనుల రీత్యా వస్తున్న వరద ముంపుతో గత్యంతరం లేని పరిస్థితుల్లో జనమే ఊళ్లు విడిచేలా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. పోలవరం ప్రాజెక్టు కేంద్రం పరిధిలోనిదైనా బిజెపి ప్రభుత్వం నిర్వాసితుల పునరావాసంపై తనకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. ఈసారైనా నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగేలా కేటాయింపులు ఉంటాయని ముంపు బాధిత ప్రజలంతా ఆశించారు. సుమారు రూ.ఐదు వేల కోట్లకుపైగా కేటాయించినా అవి పునరావాసం, పరిహారం, ప్యాకేజీ వంటి అంశాలపైనే వెచ్చిస్తారనే స్పష్టతా లేదు. ఈ నేపథ్యంలో నిర్వాసితులను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంతో కలిసి గత టిడిపి ప్రభుత్వం వలె ప్రస్తుత వైసిపి ప్రభుత్వం కూడా నట్టేట ముంచుతుందనే ఆందోళన, ఆవేదన సర్వత్రా నెలకొంది.

ఇక ఉమ్మడి జిల్లాలో రోడ్ల వ్యవస్థ అధ్వానంగా ఉంది. ఈ వేసవిలో పనులు చేపడతారని ముఖ్యమంత్రి నుంచి మంత్రుల వరకూ అంతా ఊకదంపుడుగా ప్రకటనలిచ్చినా కార్యరూపం దాల్చే పరిస్థితి లేదు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్లు, భవనాల శాఖకు కేటాయింపులే చాలా పరిమితంగా ఉన్నాయి. అవి జిల్లాకు వచ్చేటప్పటికి కనీసం ఉమ్మడి జిల్లాలోని ఏదోక ప్రాంతానికి సరిపోవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. చింతలపూడి, తాడిపూడి ఎత్తిపోతల పథకాలకు సంబంధించి కేటాయింపులు గొర్రె తోక బెత్తెడు చందంగానే ఉన్నాయి. ఇక డెల్టా ప్రాంతంలో కీలకమైన వరిసాగుకు దన్నుగా నిలిచే డెల్టా ఆధునికీకరణ పనులకు సంబంధించిన కేటాయింపులు చూస్తే విస్తుపోక తప్పదు. వర్షాకాలం ముందు హడావుడిగా చేపట్టే ఒఅండ్ఎం పనులకు కేటాయించినట్లు కూడా డెల్టా ఆధునికీకరణ పనులకు నిధులు విదల్చకపోవడం వ్యవసాయంపై ఈ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో స్పష్టమవుతోందనే వ్యాఖ్యానాలు విన్పిస్తున్నాయి. ఇక ఆక్వా యూనివర్సిటీ, ఫిషింగ్ హార్బర్‌తోపాటు డెల్టాను కాలుష్యం బారి నుంచి పరిరక్షించడానికి చేపట్టాల్సిన చర్యలకు సంబంధించిన నిధులను సైతం ఈ బడ్జెట్‌లో కేటాయించలేదు. ఇక వాటర్‌గ్రిడ్ పథకం అటకెక్కినట్లయ్యింది. దీంతో డెల్టావాసులు కలుషిత నీటితో కేన్సర్ వంటి మహమ్మారుల బారిన పడక తప్పని దుస్థితి నెలకొంది. నరసాపురం వద్ద గోదావరిపై కోనసీమ జిల్లాను కలుపుతూ నిర్మించాల్సిన వంతెన గురించిగాని, ఆచంట మండలంలో గోదావరిపై అయోధ్యలంక వద్ద నిర్మించాల్సిన వంతెనకు సంబంధించి ప్రత్యేక ప్రస్తావనేదీ లేదు. ఇక కేంద్రం చేపట్టే రైల్వేలైన్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ వాటాకు సంబంధించిన కేటాయింపులెక్కడా కానరాలేదు. దీనివల్లే కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్ నత్తనడకన సాగుతున్న విషయం తెలిసిందే. మొత్తంగా చూస్తే జిల్లావాసులకు రాష్ట్ర బడ్జెట్ ఒక అస్పష్టతతో అంచనాలను ఆవిరి చేసే విధంగా ఉందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

వైసిపిలో జోష్ నింపని ఎంఎల్‌సి ఫలితాలు

స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల ఫలితాల్లో అధికార వైసిపి తన సత్తా చాటింది. స్థానిక సంస్థల్లో తనకున్న బలంకన్నా ఎక్కువ ఓట్లు రావడంతో ప్రథమ ప్రాధాన్యతా ఓట్లతోనే ఎంఎల్‌సిలుగా కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ గెలుపొందారు. టిడిపి బలపర్చిన స్వతంత్ర అభ్యర్థి వీరవల్లి చంద్రశేఖర్ కేవలం 122 ఓట్లతో సరిపెట్టుకున్నారు. టిడిపి గెలుపొందుతుందని ఎవరూ అంచనా వేయకపోయినా కచ్చితంగా వైసిపి ఓట్లు చీలుస్తుందని అంతా భావించారు. అయితే సాధారణ ఎన్నికల్లో విధానాలకన్నా ధన, కుల, మత ప్రాబల్యం ఎలా ఉందో స్థానిక సంస్థల పెద్దల ఎన్నికల్లోనూ అదే పరిస్థితి ప్రస్ఫుటమైందని ఆయా అభ్యర్థులకు వచ్చిన ఓట్లు చెప్పకనే చెబుతున్నాయి. గెలుపోటములు సంగతి ఎలాగున్నా వైసిపి శ్రేణుల్లో ఈ గెలుపు పెద్దగా జోష్ నింపకపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ప్రధానంగా పూర్తిస్థాయి మెజార్టీ ఉన్నా గెలుపు కోసం పెద్దఎత్తున కసరత్తు చేయాల్సి రావడం, ప్రధానంగా ప్రభుత్వ తీరుపై స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతోపాటు జనంలోనూ చర్చ జరగడం ఆ పార్టీ నేతల్లో నిర్వేదాన్ని నింపుతున్నట్లు తెలుస్తోంది. ఫలితంగానే ఈ గెలుపుపై ఆనందంకన్నా వచ్చే ఎన్నికల్లో తమ అంచనాలు ఆవిరికాకుండా ఎలా ముందుకు సాగాలా అనే దానిపై వైసిపి శ్రేణులు తర్జనభర్జన పడుతున్నట్లు అర్థమవుతోందని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్



అచీవ్‌మెంట్ అవార్డు అందుకుంటున్న నీలి సుమన్

నీలి సుమన్‌కు ఎచీవ్‌మెంట్ అవార్డు

ప్రజాశక్తి - కలిదిండి

ఆక్వారంగంలో ఆక్వా లైఫ్ సేల్ చేసినందుకు గుర్తింపుగా తాను సర్వ రక్షా బయో లైఫ్ సంస్థ ఎచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నట్లు ఎంపిటిసి సభ్యులు నీలి సుమన్ తెలిపారు. స్థానిక శ్రీ మస్తాన్ బాబా ఎంటర్ ప్రైజెస్ ద్వారా ఆక్వా రైతులకు నాణ్యమైన ఉత్పత్తులను అందిస్తున్నామన్నారు. 50 టన్నుల ఆక్వా లైఫ్ సేల్స్ చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో సర్వ రక్షా బయో లైఫ్ సంస్థ ఎండి పుష్పా కుసుమాంజలి చేతుల మీదుగా ఎచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నట్లు తెలిపారు. ఆక్వా సాగులో ప్రతి రైతు నీటి, నేల ప్రాముఖ్యతను తెలుసుకోవాల్సి ఉందని కుసుమాంజలి అన్నారని చెప్పారు. అవార్డు అందుకున్న ఎంపిటిసి నీలి సుమన్‌ను పలువురు అభినందించారు.

చింతలపూడిలో ప్రత్యేక లోక్ అదాలత్

ప్రజాశక్తి - చింతలపూడి

కుటుంబ వ్యవస్థ ఎంతో బలమైందని, గొడవలు పడి సంసారాలు నాశనం చేసుకోవద్దని చింతలపూడి జూనియర్ సివిల్ న్యాయమూర్తి పి.పరేష్‌కుమార్ తెలిపారు. పట్టణంలో శనివారం ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా పరేష్‌కుమార్ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్లు, కోర్టులు సంసారాలు చేయించలేవని, భార్యాభర్తలు ఒకరినొకరు అర్థం చేసుకుని జీవించాలని చెప్పారు. పెద్దల కోసం, పిల్లల కోసం కుటుంబ వ్యవస్థను నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కాకర్ల మాణిక్యాలరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సామయ్య, సోషల్ వర్కర్ అక్బర్ అలీ, న్యాయవాదులు పాల్గొన్నారు.

గుడ్ సమరిటన్ ఆధ్వర్యంలో వైద్య సేవలు

ప్రజాశక్తి - దెందులూరు

మండలంలోని పోతునూరు గ్రామంలో పరిశుద్ధ నిత్య సహాయ మాత దేవాలయ విచారణ కర్త రెవరెండ్ ఫాదర్ పి.డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గుడ్ సమరిటన్ కేర్స్, జనరల్ ఆసుపత్రి ఏలూరు వారి సౌజన్యంతో పేద రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఎం.చంద్ర, అక్బర్ బాషా, పి.ఆర్‌కె రాజు పాల్గొన్నారు.

'వైసిపి పతనానికి ఎంఎల్‌సి ఎన్నికల ఫలితాలే నిదర్శనం'

ప్రజాశక్తి - చింతలపూడి

వైసిపి పతనానికి ఎంఎల్‌సి ఎన్నికల ఫలితాలే నిదర్శనమని టిడిపి చింతలపూడి పట్టణ అధ్యక్షులు పక్కాల ప్రెసిడెంట్, ప్రధాన కార్యదర్శి బోడ నాగభూషణం అన్నారు. పట్టణంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి శనివారం పూలమాలలు వేసి ఎంఎల్‌సి ఎన్నికల్లో టిడిపి బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం టిడిపి చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్‌కుమార్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డి మాకొద్దని స్పష్టంగా తీర్పునిచ్చారన్నారు. 2024లో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు కార్యదర్శి కొత్తపల్లి శేషగిరిరావు, రాష్ట్ర మహిళా అంగన్‌వాడీ కార్యదర్శి ముళ్లగిరి సుందరమ్మ, ఎర్రగుంటపల్లి ఎంపిటిసి సభ్యులు తులిమెల్లి భాస్కర్, శివపురం ఎంపిటిసి సభ్యులు చీకటి రాజేంద్రప్రసాద్, నియోజకవర్గ నాయకులు మారుమూరి థామస్ పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీరాణి పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - కైకలూరు

టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పోలవరపు లక్ష్మీరాణి పుట్టినరోజు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బొమ్మనబోయిన విజయలక్ష్మి, టిడిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు కెకె.బాబు, నాయకులు వీరబాబిగాని సుధ, కారుమ్మ, మైనారిటీ నాయకులు ఎండి.ఉస్మాన్, చక్కా పూర్ణ, కంచర్ల రామకృష్ణ, మండల యువత అధ్యక్షులు అనాసీ ఖాన్, టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి ఆకుల వినయ్, ఉపాధ్యక్షులు పడమట వాసు, సైదు నాగేశ్వరరావు, గడిదేశి విజయకుమార్ పాల్గొన్నారు.

అన్నవరంలో 'నో బ్యాగ్ డే'

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని అన్నవరం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం నో బ్యాగ్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పుస్తకాలకు దూరంగా బొమ్మలు, ఆట వస్తువులను తయారు చేస్తూ గడిపారు. వ్యర్థ పదార్థాలతో తక్కువ ఖర్చుతో బొమ్మలను, ఆట వస్తువులను ఎలా తయారు చేయవచ్చో ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. నో బ్యాగ్ డే రోజున విద్యార్థులు పాఠశాలలో సంతోషంగా గడిపారు.

22 నుంచి దెందులూరు రైల్వే గేటు మూసివేత

ప్రజాశక్తి - దెందులూరు

ఏలూరు నుంచి పంగిడిగూడెం వెళ్లే రహదారిలో ఉన్న దెందులూరు రైల్వే గేటు మరమ్మతుల నిమిత్తం ఈ నెల 22వ తేదీ సాయంత్రం ఏడు గంటల నుంచి 25వ తేదీ సాయంత్రం ఆరు గంటల వరకు మూసి వేయనున్నట్లు రైల్వే శాఖ అధికారులు తెలిపారు. ఆ మార్గం గుండా వెళ్లేవారు ప్రత్యామ్నాయ మార్గాలను ఎన్నుకొని సహకరించాలని కోరారు.

'ప్రజా సమస్యలపై జనసేన పోరాటం'

టి.నరసాపురం:ప్రజా సమస్యలపై జనసేన పోరాటం చేస్తోందని ఆ పార్టీ పోలవరం నియోజకవర్గ కన్వీనర్ చిర్రి బాలరాజు అన్నారు. మండలంలోని మధ్యాహ్నపువారిగూడెంలో శనివారం పర్యటించిన ఆయన గ్రామాల్లో ముఖ్య కార్యకర్తలను, పార్టీ సానుభూతిపరులను కలిసి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. గ్రామాల్లో వివిధ వర్గాల ప్రజలను కలిశారు. ఈ సందర్భంగా వివిధ వర్గాల నుంచి వచ్చిన నేతలు వచ్చే ఎన్నికల్లో జనసేన ప్రభంజనం సృష్టించడం ఖాయమన్నారు. ప్రజా సమస్యలపై జనసేన పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు అడపా నాగరాజు, ప్రధాన కార్యదర్శులు మధ్యాహ్నపు దేవి పెంటారావు, షేక్ ఇమామ్, ఎస్.వెంకటేశ్వరరావు, మాండ్రు రాంబాబు, సింగులూరి దొరబాబు, పోపోలు సుబ్రహ్మణ్యం, తోట సాయి, రాఘవరావు సురేష్, పెద్దింటి చంటి పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 30 కేసులు రాజీ

ఏలూరు:ఉమ్మడి జిల్లాలో శనివారం ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించినట్లు ఏడో అదనపు జిల్లా జడ్జి ఆర్.రామకృష్ణంరాజు తెలిపారు. కేసుల రాజీకి 12 బెంచీలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాశ్వత న్యాయ పీఠం ఛైర్మన్ ఎ.మేరీ గ్రేస్ కుమారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వర్, ఏలూరు అడ్వకేట్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శేఖర్ రెడ్డి, ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాలో 30 కేసులు రాజీ చేశామని, రూ.62 లక్ష 20 వేలు మనోవర్తిని ఇప్పించామని తెలిపారు.

ఖాతాదారుల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

మండవల్లి:ఖాతాదారుల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయమని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు పనిచేస్తున్నాయని పిఎసిఎస్ ఛైర్మన్ బి.గోవర్ధనరావు స్పష్టం చేశారు. స్థానిక కార్యాలయంలో ఖాతాదారులు శరణం శెట్టి శ్రీనివాసరావు మృతి చెందడంతో మట్టి ఖర్చుల నిమిత్తం రూ.పదివేలు శనివారం అందించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ సెక్రటరీ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

'మానవత' ఆధ్వర్యాన సేవా కార్యక్రమాలు

వికలాంగునికి మూడు చక్రాల సైకిల్‌ను అందిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలోని పూళ్ల గ్రామంలో మానవత స్వచ్ఛంద సంస్థ భీమడోలు శాఖ ఆధ్వర్యంలో శనివారం రెండు కార్యక్రమాలను చేపట్టినట్లు శాఖ ఛైర్మన్ గుళ్ల నూకరాజు తెలిపారు. దీనిలో భాగంగా గ్రామానికి చెందిన దాత వట్టి రాజు పూళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులు కోసం అవసరమైన వీల్‌ఛైర్‌ను మానవత ద్వారా అందించారు. వీటిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తరపున వైద్యులు లీలా ప్రసాద్, డాక్టర్ కల్యాణి, డాక్టర్ అరవింద స్వీకరించారు. ఇదే గ్రామంలో నిర్వహించిన మరొక కార్యక్రమంలో దాతలు కేతినీడి విశ్వేశ్వరరావు, పచ్చా వెంకటేశ్వరరావు, యాసా సీతారామయ్యతో పాటు మానవత సంస్థ అందించిన అదనపు సహాయంతో గ్రామానికి చెందిన వికలాంగునికి మూడు చక్రాల సైకిల్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో శాఖ అధ్యక్షులు పచ్చా వెంకటేశ్వరరావు, అకాడమిక్ సెల్ డైరెక్టర్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటిలో ఉచిత దంత వైద్యశిబిరం

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు ట్రిపుల్ ఐటి కళాశాలలో శ్రీభాను దంత వైద్యశాల రూట్ కెనాల్ ట్రీట్‌మెంట్ సెంటర్ వారి ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం ఉచిత దంత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. విద్యార్థులను వైద్యులు పరీక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ దేవిశెట్టి దినేష్‌బాబు మాట్లాడుతూ ఇహెచ్‌ఎస్, డబ్ల్యూజెహెచ్‌ఎస్, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు, జర్నలిస్టులు, ఎపిఎస్‌ఆర్‌టిసి సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్యం అందించనున్నట్లు తెలిపారు. పంటి పుచ్చు, బలహీన దంతాలు, పాల పళ్లు, మిక్స్ పళ్లు, నోటి దుర్వాసన, చిగుళ్ల నుంచి రక్తం, నోటి పూత, ప్రమాదాల్లో విరిగిన దవడలు, కట్టుడు పళ్లు, తీసి పెట్టుకునే పళ్ల సెట్టు, ఎత్తు, వంకర పళ్లు, నోరు నాలుకలపై వచ్చే మచ్చలు, జ్ఞాన దంతాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. పెదవులపై నాలుక కింద కణులు, నాలుక చిగురు అతుక్కుపోవడం (టంగ్ టై), పళ్ల రంగు మారడం, ఇలా అనేక రకాల వ్యాధులకు చికిత్స అందించనున్నట్లు చెప్పారు. వృద్ధులకు పళ్ల సెట్టు, కృత్రిమ దంతాల అమరిక తమ ప్రత్యేకతగా చెప్పారు. నాలుక శుభ్రపరిచేందుకు బ్రష్‌ను వినియోగించటం ఎంతో శ్రేయస్కారంగా సూచించారు. పోషకాహారం మన శరీరంలో తగ్గితే చిగురు రంగు మారడం, పంటి చిగురు వ్యాధులు రావడం సంభవిస్తాయన్నారు. దంత సమస్యలపై అవగాహన కల్పించటం తమ లక్ష్యంగా భావించి ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు తెలిపరు. మరిన్ని శిబిరాలు ఏర్పాటు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని వివరించారు. మెడికల్ సిబ్బంది, ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

మహిళా సంఘాలపై ఒత్తిడి తగదు

జంగారెడ్డిగూడెం సర్వసభ్య సమావేశంలో ఎంపిటిసి సభ్యులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మహిళా మార్ట్‌లో వస్తువులు కొనాల్సిందేనని మహిళా సంఘాలను ఒత్తిడి చేయడం తగదని పలువురు ఎంపిటిసి సభ్యులు ధ్వజమెత్తారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి కొదమ జ్యోతి అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేగవరం ఎంపిటిసి సభ్యులు కుక్కల సత్యనారాయణ మాట్లాడుతూ డ్వాక్రా మహిళ మండలి సభ్యులను బలవంతంగా పొదుపులో డబ్బులు తీయించి సిఎలు వారిని బలవంతపు ఆటో కిరాయిలతో జంగారెడ్డిగూడెం తీసుకువచ్చి మహిళా మార్ట్‌లో మనిషికి రూ.2500తో కొనుగోలు చేపిస్తున్నారని తెలిపారు. పొదుపు డబ్బులతో బలవంతంగా ఎందుకు తీసుకువెళ్లాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు ఈ ఘటనపై అసహనం వ్యక్తం చేశారు. చక్కర దేవరపల్లి సర్పంచి ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ పంచాయతీల్లో ఉద్యోగులకు, స్వీపర్లకు జీతాలు ఇవ్వడానికి కూడా నిధులు లేని పరిస్థితి వచ్చిందని అసహనం వ్యక్తం చేశారు. వేగవరం సర్పంచి లక్కాబత్తుల నాగరాజు మాట్లాడుతూ డంపింగ్ యార్డ్‌కు కరెంట్ కావాలని అధికారులను కోరారు. ఈ సమస్యలపై ఎంపిపి కొదమ జ్యోతి మాట్లాడుతూ త్వరలో చింతలపూడి ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా, అధికారులతో మాట్లాడిపై సమస్యలన్నీ త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సభ్యులు పి.బాబ్జీ, ఎంపిడిఒ కిరణ్, తహశీల్దార్ స్లీవజోజి పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ఏలూరు టౌన్: సీనియర్ ఇంటర్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. ఉమ్మడి జిల్లాలోని 106 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఆయా కేంద్రాల్లో 33,485 మంది విద్యార్థులకు 32,538 మంది హాజరయ్యారు. ఏలూరు జిల్లాలో 39 కేంద్రాల్లో 12,361 మంది విద్యార్థులకు 15948 మంది హాజరయ్యారు. పశ్చిమగోదావరి జిల్లాలో 52 కేంద్రాల్లో జనరల్ విద్యార్థులు 14,584 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1,426 మంది హాజరయ్యారు. 97 శాతం హాజరు నమోదైంది.

టిడిపి విజయం పట్ల నేతల హర్షం

ముసునూరు:ఎంఎల్‌సి ఎన్నికల్లో టిడిపి ఘనవిజయం సాధించిన సందర్భంగా శనివారం మండలంలోని గుడిపాడుకు చెందిన రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు పార్టీ అధ్యక్షులు చంద్రబాబును కలిసి అభినందలు తెలిపారు.

ముదినేపల్లి : పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో టిడిపి విజయం సాధించడంతో ఆ పార్టీ నేతలు ముదినేపల్లిలో శనివారం బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. టిడిపి యువనేత కొడాలి వినోద్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద ఆనందం వ్యక్తం చేశారు. విగ్రహానికి పూలమాలలు వేశారు.

రూ.35 లక్షలతో ఉంగుటూరు హైస్కూల్ అభివృద్ధి

ఉంగుటూరు:ఉంగుటూరు హైస్కూల్ అభివృద్ధికి నాడు - నేడులో రూ.35 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు మూడు తరగతి గదుల నిర్మాణానికి ఎంపిపి గంటా శ్రీలక్ష్మి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ బాలకృష్ణ, సందక రాంబాబు , సర్పంచి బండారు సింధు, విద్యా కమిటీ ఛైర్మన్, వైసిపి నాయకులు, పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులను దండించడం దారుణం

జంగారెడ్డిగూడెం :స్థానిక జెడ్‌పి హెచ్ బాలుర పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థులను దండించి పోలీస్ స్టేషన్‌లో అప్పగించిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. ఫ్యాను రెక్కలు ధ్వంసం చేశారనే కారణంతో విద్యార్థులను కొట్టి పోలీస్‌స్టేషన్‌లో అప్పజెప్పడం దారుణమన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం : బాలరాజు

బుట్టాయగూడెం:అకాల వర్షం వల్ల దెబ్బతిన్న పంటల వివరాలను పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు వ్యవసాయ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో కల్లాలలో ఆరబెట్టిన మిరప పంట, మొక్కజొన్న, పొగాకు తదితర పంటల నష్టాలను ఆరా తీశారు. రైతులు నష్టపోకుండా వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని, సహాయం కోసం నివేదిక పంపాలని అధికారులను ఆదేశించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పవన్ ట్రేడర్స్ దగ్ధం

ఏలూరు స్పోర్ట్స్:స్థానిక వన్‌టౌన్‌లోని పవన్ ట్రేడర్స్‌లో షార్ట్ సర్క్యూట్‌తో శనివారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. వన్‌టౌన్‌కు చెందిన రెడ్డి పవన్ ట్రేడర్స్ పేరుతో ప్లాస్టిక్ వస్తువుల విక్రయ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి తాళాలు వేసి ఇంటికి వెళ్లిపోయారు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ప్లాస్టిక్ సామగ్రి పూర్తిగా కాలిపోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. ఫైర్ అధికారులు నష్టం అంచనా వేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ముదినేపల్లి :ఆటో ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న సంఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయాలైన ఘటన శనివారం సింగరాయపాలెం సమీపంలో జరిగింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దేవపూడి నుంచి సింగరాయపాలెం వైపు వెళ్తున్న పాసింజర్ ఆటో సింగరాయపాలెం సమీపంలో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అల్లూరు గ్రామానికి చెందిన కట్టా ఆమలేశ్వరరావు, లుక్కా శ్రీనివాసరావుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు స్పందించి క్షతగాత్రులను ముదినేపల్లిలోని ఆసుపత్రికి తరలించారు.

బంగారం చోరీ కేసులో నలుగురు అరెస్టు

ఏలూరు స్పోర్ట్స్:బంగారం చోరీ కేసులో నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుండి 650 గ్రాముల బంగారు ఆభరణాలు, సెల్ ఫోన్లు, కారు ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ వివరాలు వెల్లడించారు. భీమడోలు గ్రామానికి చెందిన కొమ్మిన శ్రీను స్థానికంగా కారు నడుపుకుంటూ జీవించేవాడు. కొద్దికాలం క్రితం రాజమండ్రి ప్రాంతానికి చెందిన మట్టపర్తి రాజ్‌కుమార్‌తో, కాకినాడకు చెందిన కాకరపర్తి సాయి, రవికాంత్, కొండపల్లి అరుణ్‌కుమార్‌తో పరిచయం ఏర్పడింది. వీరు శ్రీనుకు పెద్దమ్మ వరుస అయ్యే నిడమర్రులోని జానకమ్మ బంగారాన్ని దోచుకోవాలని పథకం రచించారు. ఈ క్రమంలో ఈ నెల 14వ తేదీన జనకమ్మ ఇంటికి వెళ్లి ఆమెను కత్తితో బెదిరించి ఇంట్లో ఉన్న 650 కాసుల బంగారు నగలను అపహరించుకుపోయారు. అనంతరం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిడమర్రు ఎస్ఐ వెంకటేశ్వరరావు, ఏలూరు డిఎస్‌పి పైడేశ్వరరావు ఆధ్వర్యంలో గణపవరం సిఐ సుభాష్ పర్యవేక్షణలో కేసు విచారణ చేపట్టారు. ఈ క్రమంలో శనివారం ఉదయం శ్రీను, రాజ్ కుమార్, సాయి, అరుణ్ ఒకే కారులో గణపవరం మండలం సరిపల్లి నుండి వెళ్తుండగా వాహన తనిఖీల్లో పోలీసులకు చిక్కారు.

కుట్టుమిషన్లు, వీల్‌ఛైర్లు అందజేత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక శ్రీమద్ది ఆంజనేయ మాక్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో వికలాంగులకు వీల్‌ఛైర్లు, పేద మహిళలకు కుట్టుమిషన్లు శనివారం అందించారు. స్థానిక కరాటం వై.జంక్షన్‌లోని శ్రీదండమూడి వశిష్ట కల్యాణమండపంలో జంగారెడ్డిగూడెం శ్రీమద్ది ఆంజనేయ మాక్స్ లిమిటెడ్ ప్రతమ వార్షికోత్సవం మాక్స్ మేనేజింగ్ డైరెక్టర్ దాకారపు నరసింహమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నాట్యగురువు శీలా రూపాదేవి కూచిపూడి నృత్యప్రదర్శన పలువురిని అలరించింది. ఈ కార్యక్రమంలో ఎపి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్, క్రెడిట్ సొసైటీస్ ఫెడరేషన్ కార్యదర్శి చలసాని రాఘవేంద్రరావు, మాక్స్ డైరెక్టర్, సీనియర్ ఛార్టర్డ్ అకౌంటెంట్ బండారు సత్యనారాయణ, రాజమండ్రికి చెందిన రవీంద్ర, రాంబాబు, శ్రీమద్ది ఆంజనేయ మాక్స్ ఖాతాదారులు, లబ్ధిదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆ గ్రామాలనూ మొదటి కాంటూరులో చేర్చాలి

వేలేరుపాడు :మండలంలోని బోళ్లపల్లి, కొత్తూరు, పడమట మెట్ట గ్రామాలను కూడా 41.15 మొదటి కాంటూరు పరిధిలో కలిపి నిర్వాసితులకు న్యాయం చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. స్థానిక సిపిఎం కార్యాలయంలో మడకం ఏసుబాబు అధ్యక్షతన పార్టీ మండల కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి ధర్ముల రమేష్ మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో వరదల సమయంలో నీటమునిగే ఎనిమిది గిరిజన గ్రామాలను మొదటి కాంటూర్‌లో చేరుస్తూ ప్రభుత్వం ప్రకటించడంపై సిపిఎం హర్షం వ్యక్తం చేస్తుందన్నారు. మొదటి కాంటూరు పరిధిలోనే మిగత గ్రామాలు బొల్లపల్లి, కొత్తూరు, పడమర మెట్ట గ్రామాలను కూడా చేర్చాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మడివి దుర్గారావు, కొత్త వెంకటేశ్వర్లు, గుమ్మాల వెంకటనరసయ్య, వెంకట్రావు, ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - దెందులూరు

సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని శ్రీ సీతారామ ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల గోపన్నపాలెం ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నతానియేలు సూచించారు. శనివారం గ్రామ పంచాయతీ, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, దిశా యాప్‌పై అవగాహన సదస్సు జరిగింది.

ఆశాల మహాధర్నాను జయప్రదం చేయాలని ప్రచారం

ముసునూరు:ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ ఈనెల 21న విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ఆశా వర్కర్లకు ప్రచారకరపత్రాలను వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పిల్లి మురళీ ఆధ్వర్యంలో శనివారం అందజేశారు. రమణక్కపేట, చెక్కపల్లి, అక్కిరెడ్డిగూడెం గ్రామాల్లోని ఆశాలకు వీటిని అందజేశారు.

గ్రామపంచాయతీ కార్యాలయము, కాళ్ళపాలెం

ఆర్.ఓ.సి.నెం. 1/2023 **టెండరు నోటీసు** తేది. 17-03-2023

ఏలూరు జిల్లా, కలిదిండి మండలం, కాళ్ళపాలెం గ్రామ పంచాయతీ ఏరియాలో ఈ దిగువ షెడ్యూల్ నందు తెలిపిన పనులు చేయుటకు కాంట్రాక్టు లేబర్ పద్ధతి పై నలుగురు వ్యక్తులు ఒక సంవత్సరము అనగా ది.01-04-2023 నుండి 31-03-2024 వరకు పనులు చేయుటకు ది.21-03-2023వ తేదీ మంగళవారం సాయంత్రం 3:00 గంIIల వరకు టెండర్లు స్వీకరించబడును. సదరు టెండర్లు అదే రోజు సాయంత్రం 3:30 గంIIలకు టెండరు దారుల సమక్షంలో తెరవబడును. సదరు టెండర్లు గ్రామ పంచాయతీ కార్యదర్శిచే గాని వారి అనుమతి పొందిన వారిచే గాని స్వీకరించబడును. ఇతర విషయములకు పంచాయతీ కార్యాలయం పనిచేయు వేళల యందు తెలుసుకొనవచ్చును.

వ.నెం.	టెండరు వివరములు	కాలపరిమితి	ధరావతు
1	ఫిట్టర్-1 (ఒక వ్యక్తి సేవలు)	ది.01-04-2023 నుండి 31-03-2024	రూ.1000/-
2	ఫిట్టర్-2 (ఒక వ్యక్తి సేవలు)	ది.01-04-2023 నుండి 31-03-2024	రూ.1000/-
3	స్వీపర్ (ఒక వ్యక్తి సేవలు)	ది.01-04-2023 నుండి 31-03-2024	రూ.1000/-
4	ఎలక్ట్రీషియన్ (ఒక వ్యక్తి సేవలు)	ది.01-04-2023 నుండి 31-03-2024	రూ.1000/-

నోట్: 1) పూర్వం అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
2) గ్రామ పంచాయతీ నిధుల నిల్వలను బట్టి జీతాలు ఇవ్వబడును.
3) టెండర్లు స్వీకరించుటకు తిరస్కరించుటకు పంచాయతీ వారికి అధికారము కలదు.

సం/- శ్రీమతి పెటేటి స్వర్ణకుమారి, సర్పంచ్, కాళ్ళపాలెం, కలిదిండి మండలం, ఏలూరు జిల్లా
సం/- ఆర్.వి.ఉదయ్‌కుమార్, పంచాయితీ కార్యదర్శి, కాళ్ళపాలెం, కలిదిండి మండలం, ఏలూరు జిల్లా

గ్రామపంచాయతీ కార్యాలయము, కోరుకొల్లు

ఆర్.ఓ.సి.నెం. 1/2023 **టెండరు నోటీసు** తేది. 17-03-2023

ఏలూరు జిల్లా, కలిదిండి మండలం, కోరుకొల్లు గ్రామ పంచాయతీకి సంబంధించి కాంట్రాక్టు లేబరు పోస్టులు భర్తీ చేయు నిమిత్తం టెండర్లు పిలుచుటకు పంచాయతీ నుండి టెండరు ప్రకటన ఇచ్చుటకు పంచాయతీ వారు అంగీకరించినారు. ది.20-03-2023వ తేదీన ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు పంచాయతీ సెక్రటరీ గారిచే టెండర్లు తీసుకొనబడును. పంచాయతీ సెక్రటరీ గాని, వారి అనుమతి పొందిన వారు గాని అయి ఉండవలెను.

వ.నెం.	పోస్టుల వివరాలు	పోస్టులు	టెండరు ధరావతు
1	స్వీపర్లు	10	రూ.5000/- లేక సాల్వెన్స్ సర్టిఫికెట్
2	ట్యాంక్ ఆపరేటర్ మరియు ఫిట్టర్	3	రూ.5000/- లేక సాల్వెన్స్ సర్టిఫికెట్
3	ట్రాక్టర్ డ్రైవర్	1	రూ.5000/- లేక సాల్వెన్స్ సర్టిఫికెట్
4	ఎలక్ట్రీషియన్	1	రూ.5000/- లేక సాల్వెన్స్ సర్టిఫికెట్
5	ఎలక్ట్రీషియన్ సహాయకుడు	1	రూ.5000/- లేక సాల్వెన్స్ సర్టిఫికెట్

పనిదినములు: ది.01-04-2023 నుండి ది.31-03-2024 వరకు
నోట్: 1) పై తెలిపిన పనులకు మాత్రమే కాకుండా పంచాయతీకి సంబంధించిన ఇతర పనులు కూడా చేయుటకు అంగీకారం తెలుపవలెను.
2) గ్రామ పంచాయతీ నిధుల లభ్యతను బట్టి జీతం ఇవ్వబడును.
3) గతంలో ఈ పంచాయతీలో పని చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
4) 60 సంIIలు దాటిన వారు టెండరుకు అనర్హులు.

సం/- బి.ఎల్.కె.దుర్గ, సర్పంచ్, కోరుకొల్లు, కలిదిండి మండలం, ఏలూరు జిల్లా.
సం/- ఆర్.వి.ఉదయ్ కుమార్, కార్యదర్శి, కోరుకొల్లు, కలిదిండి మండలం, ఏలూరు జిల్లా.

పలువురు బాధితులకు బొరగం శ్రీనివాస్ పరామర్శ

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం మండలంలో ఇటీవల గాయాలపాలైన టిడిపి నాయకులను, కుటుంబ సభ్యులను కోల్పోయినవారిని బిసి నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ శనివారం పరామర్శించారు. పోలవరం మండల కేంద్రంలో బిసి కాలనీలో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి నాయకులు ఎస్‌కె.కాజా, రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతున్న జల్లేపల్లి వేణుగోపాలరావు, సిద్దన రాంబాబులను ఆయన పరామర్శించారు. వారికి టిడిపి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం కొత్తపేట కాలనీలో కుటుంబ సభ్యులను కోల్పోయిన టిడిపి నాయకులు ఎస్‌కె.రబ్బానిని, జగన్నాధపేటలో మీసాల శివప్రసాద్ కుటుంబాన్ని, గూటాలలో కాట్రు రామారావును, ఒబిలిశెట్టి నాగన్న కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. శుక్రవారం రాత్రి మృతిచెందిన టిడిపి సీనియర్ నాయకులు, నీటి సంఘం మాజీ అధ్యక్షులు నునకాని సత్యనారాయణ మృతదేహంపై టిడిపి పతాకాన్ని ఉంచి నివాళులర్పించారు. వారి కుమారుడు టిడిపి మండల ప్రధాన కార్యదర్శి నునకాని రాంబాబును పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి టౌన్ ప్రెసిడెంట్ పోతుల శ్రీనివాసరావు, టిడిపి మండల నాయకులు మంగినకొండ, జితేంద్ర పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

షేక్ సుభాని, భర్త: కరీం అను నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. ఇంటి నుండి ఫైర్ స్టేషన్ సెంటర్‌కి జిరాక్సు నిమిత్తం వెళ్తుండగా నాయొక్క పాస్‌పోర్టు పడిపోయినది. పాస్‌పోర్టు నెంబర్: **T0938860 గల పాస్‌పోర్టు** ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

షేక్ సుభాని
భర్త: కరీం, H.No. 26-2-38, అశోక్ నగర్, బురగ గూడెం, కొత్తూరు, ఏలూరు జిల్లా, పిన్: 534 002. సెల్ : 81433 56003

CHANGE OF NAME

I, KARRI HARISH BABU, Date of Birth 29-07-2000, Residing at D.No. 3-73, Bondada Road, Jakkaram Village, Kalla Mandal, West Godavari District - 534 206, Andhra Pradesh have changed my name form **KARRI HARISH (Old Name) to KARRI HARISH BABU (New Name).** Hence after all my documents and correspondence will continue with my New Name **KARRI HARISH BABU.**

KARRI HARISH BABU
D.No. 3-73, Jakkaram Village, Kalla Mandal, West Godavari District, Andhra Pradesh - 534 206

In The Court Of The Principal Distrtict Judge W.G.Dist :: Eluru
M.V.O.P.No. 540/2022

Between:
Chitturi Ranga Rao ...*Petitioner*
AND
Tavakkal Beig and Others ...*Respondents*

పై నెంబరు పిటీషనులో 1వ రెస్పాండెంటు అయిన R1: Being Tavakkal, S/o. Yusaf Beig, R/o. H.NO. 18-1-1/1, Gun Bazar, 48th Division, Eluru, W.G.Dist., అను వారికి నోటీసులు అమలు కొరకు **ది.20-03-2023వ తేదీకి వాయిదా అయి ఉన్నది. సదరు వాయిదా రోజు ఉదయం గంII10:00 నిIIలకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి ఆక్షేపణలు తెలుపుకోవలెను.** లేని ఎడల వారి పరోక్షమందు సంగతులు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
ఏలూరు, 17-03-23. **ఇ.శ్రీనివాసబాబు**, న్యాయవాది, ఏలూరు.

ప్రకటన

మా నాయనమ్మగారైన **కూరపాటి వెంకటసుబ్బమ్మ గారికి వారి తండ్రిగారైన వేగుంట కాశీవిశ్వనాధరావు** గారు ది. 27-08-1957వ సంIIరం తేదీన ఏలూరు సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయము నందు దఖలు దస్తావేజు వ్రాయించి, దఖలు దస్తావేజు నెం.4878/1957రుగా రిజిస్ట్రీ చేయించిన దరిమిలా ఆమెకు సంక్రమించిన స్థిరాస్థి పెదపాడు మండలం, వట్లూరు గ్రామంలోని సర్వే నెం. 331రులో య.3-56ట్లు, సర్వే నెం.332/2లో య.3-18ట్లు, సర్వే నెం.332/3రులో య.0-6ట్లు, సర్వే నెం. 345లో య.1-87ట్లు, సర్వే నెం.358/2లో య.1-26ట్లు వెరశి య.9-93ట్లు సంక్రమించినది. తదుపరి మా నాయనమ్మగారైన కూరపాటి వెంకట సుబ్బమ్మ గారు నాకు అనగా కూరపాటి తాండవ కృష్ణమోహన్‌కు ది.25-02-2003 వ తేదీన దఖలు దస్తావేజు నెం. 1529/2003రుగా ఏలూరు యస్.ఆర్.ఓ.లో రిజిష్టరీ చేయించిన దరిమిలా నాకు సంక్రమించిన స్థిరాస్థి వట్లూరు గ్రామంలోని పైన పేర్కొన్న భూములే కాకుండా, నాకు మా నాయనమ్మ గార్రైన కూరపాటి వెంకట సుబ్బమ్మ గారి వలన నాకు సంక్రమించిన స్థిరాస్థి వట్లూరు గ్రామంలోని సర్వే నెం. 331లో య.0-07.50ట్లున్నూ, ఆర్.యన్.నెం.332/2లో య.0-01.25ట్లు వెరశి య.0.08.75ట్లు సంక్రమించినది. సర్వే నెం. 331లో య.0-07.50ట్లు, సర్వే నెం.331లో య.0-74ట్లు, సర్వే నెం.332/3లో య.0-06ట్లు, సర్వే నెం. 332/2లో య.0-86.50ట్లు, సర్వే నెం.332/2లో య.0-01.25ట్లు, సర్వే నెం.345రులో య.1-12ట్లు, సర్వే నెం.358/2లో య.0-44.50ట్లు, వెరశి మొత్తం య.3-31.75ట్లు పై సంక్రమించి ఆస్థిని నేను తదాది నాటినుండి నేటివరకు నాయొక్క సంపూర్ణ స్వాధీన అనుభవ హక్కుభుక్తములతో అనుభవించుచున్న స్థిరాస్థి పెదపాడు మండల తహశీల్దారు వారు ఇ.పట్టాదార్ పాస్బుక్ ఖాతా నెం. 2730 పట్టా మంజూరు చేసియున్నారు. పై తెల్పిన స్థిరాస్థిలో సర్వే నెం.331, 332/2లో య.0-50ట్లు ఏలూరు నగరం, దక్షిణపువీధి కాపురస్తులు కోరుకొండ రామకృష్ణ గారి భార్య కోరుకొండ కోటేశ్వరి లక్ష్మి గారికి అగ్రిమెంటు చేసియుండుట తప్ప మరెవ్వరికీ ఏవిధమైన తనఖా, హామీ, లీజు, కోర్టుజప్తులు వగైరాలు చేసియుండలేదనిన్నీ, కాగా, పై తెల్పిన స్థిరాస్థిపై కొంతమంది అక్రమార్కులు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి, ఆస్థిని అన్యాక్రాంతం చేయాలని ప్రయత్నించు చున్నట్లుగా తెలియవచ్చినది. కనుక అటువంటి లావాదేవీలు ఏమి జరిగినను నా క్లయింటుకు సంబంధం లేదని అవి నా క్లయింటును బాధ్యులను చేయజాలరని ఇందుమూలముగా తెలియజేయుటమైనది. అటుల చేసిన వారిపై తగు చట్టపరమైన చర్యలు తీసుకొనబడునని ఇందుమూలముగా హెచ్చరించుచున్నాము.

కె.వి.రత్నం
అడ్వకేట్, ఏలూరు. సెల్: 98667 27232